ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 25-11-2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. వడ్డీ లేని రుణాల పంపిణీ మూడో దశలో భాగంగా రాష్ట్రంలోని మూడున్నర లక్షల స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం నేడు 304 కోట్ల రూపాయల రుణాలను పంపిణీ చేస్తోంది.
2. రాష్ట్ర ప్రభుత్వ క్రీడా ప్రోత్సాహక విధానాలు, చర్యలతో తెలంగాణ క్రీడాకారులు ప్రపంచ వేదికలపై అద్భుత ప్రదర్శనలు కొనసాగిస్తున్నారని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.
3. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కొద్దిసేపటి క్రితం రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం ప్రారంభమైంది.
4. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 8, 9వ తేదీల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025' ఏర్పాట్లు, నిర్వహణపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేటి నుంచి సమీక్షా సమావేశాలను నిర్వహిస్తారు.

----------------------------

**వడ్డీ లేని రుణాల పంపిణీ**

మహిళా సాధికారత లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం నేడు వడ్డీ లేని రుణాల పంపిణీ మూడో దశ చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని మూడున్నర లక్షల స్వయం సహాయక సంఘాలకు మొత్తం 304 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను పంపిణీ చేస్తోంది. ఈ రుణాల మొత్తం నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయి రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలో ప్రజా ప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో రుణాల పంపిణీ చేపట్టారు. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి మల్లు విక్రమార్క ఈ కార్యక్రమంపై మంత్రి

సీతక్క , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, జిల్లా కలెక్టర్లతో నిన్న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

**(డెస్క్)**

------------------------------

**తుమ్మల- రైతు నేస్తం**

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ రోజు రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విత్తన ముసాయిదా బిల్లుపై రైతులతో ముఖాముఖి చర్చ నిర్వహించారు. రైతు వేదికల నుంచి ద్రుశ్య మాధ్యమం ద్వారా రైతులు హాజరవగా.. కేంద్రం తీసుకురానున్న విత్తన బిల్లులోని అంశాలపై వారి నుంచి మంత్రి నేరుగా అభిప్రాయాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జాతీయ ఆహార భద్రతా మిషన్-NFSM పథకం కింద విత్తనాల సరఫరాకు సంబంధించి తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు. ముఖ్యంగా, వాతావరణ కాలుష్యానికి కారణమవుతున్న పంట అవశేషాలను కాల్చకుండా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యామ్నాయాల గురించి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కొదండరెడ్డి, తెలంగాణ విత్తన కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**(డెస్క్)**

-------------------------

**నిఖత్ జరీన్-శ్రీహరి**

రాష్ట్ర ప్రభుత్వ క్రీడా ప్రోత్సాహక విధానాలు, చర్యలతో తెలంగాణ క్రీడాకారులు ప్రపంచ వేదికలపై అద్భుత ప్రదర్శనలు కొనసాగిస్తున్నారని క్రీడా, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని, వారికి పూర్తి భరోసా కల్పిస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. ఇటీవల గ్రేటర్ నోయిడాలో జరిగిన ప్రపంచ కప్ కప్ ఫైనల్స్ టోర్నమెంట్ లో స్వర్ణ పతకం సాధించిన నిఖత్ జరీన్ ను ఈ ఉదయం మంత్రుల నివాస సముదాయంలో శ్రీహరి అభినందించారు. నిఖత్ జరీన్

భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశ, రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచాలని ఆకాంక్షించారు.

**(డెస్క్/కేఆర్)**

-------------------------

**క్యాబినెట్**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం కొద్ది సేపటి కిందట డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కొత్త సచివాలయంలో ప్రారంభమైంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే నేపథ్యంలో తీసుకోవాల్సిన న్యాయపరమైన చర్యలపై మంత్రి వర్గం ఇందులో చర్చించనుంది. విద్యుత్ రంగ సమస్యలు,రామగుండంలో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు అంశాలపై కూడా చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

**DESK**

---------------------------

**తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 సీఎం సమీక్షలు**

రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 8, 9వ తేదీల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025' ఏర్పాట్లు, నిర్వహణపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు సమీక్షా సమావేశాలను నిర్వహిస్తారు. హైదరాబాద్ బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో జరిగే సమీక్షల్లో తెలంగాణ రైజింగ్ 2047 విధాన పత్రానికి తుది మెరుగులు దిద్దుతారు. నేడు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్బాబుతో కలిసి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష చేస్తారు.

**(పీఎస్)**

--------------------------------

**కొత్తగూడెం-కూనంనేని**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ, చుంచుపల్లి, లక్ష్మీదేవి పల్లి మండలాల్లోని మహిళలకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు. గత ప్రభుత్వానికి భిన్నంగా

నాణ్యమైన చీరలు అందించి పేద మహిళల సామాజిక గౌరవం పెంపొందే దిశగా నిర్ణయం తీసుకోవడం ప్రశంసనీయమైనదని కొనియాడారు.

**(PTC-B. KGM)**

---------------------------

**సిరిసిల్ల-ఎస్బీఐ**

భూమిపై రుణాలు తీసుకొని, వాటిని తిరిగి చెల్లించలేక మొండి బకాయిలు గా మారిన వారికి సెటిల్‌మెంట్ చేసుకోవడానికి ఒక అవకాశం కల్పిస్తున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఎస్బీఐ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ బి. తనుష్ తెలిపారు. రుణగ్రహీతలు తీసుకున్న మొత్తం రుణంలో 30 శాతం మొత్తాన్ని డిసెంబర్ 13 లోపు చెల్లించి, తమ ఖాతాలను సెటిల్‌మెంట్ చేసుకోవచ్చని ఆకాశవాణితో తెలిపారు.

**(సౌండ్ బైట్ ఎస్బీఐ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ బి. తనుష్)**

**(పీటీసీ, సిరిసిల్ల)**

----------------------

**పటేల్-డీకే అరుణ**

దాదాపు 564కు పైగా సంస్థానాలను కలిపి భారత దేశాన్ని ఏకం చేసిన మహనీయుడు మాజీ ఉప ప్రధాన మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని నేడు వనపర్తి జిల్లాలోని కొత్తకోట మండల కేంద్రంలో నిర్వహించిన ఏక్తా ర్యాలీ లో ఎంపీ పాల్గొన్నారు.

**(పీటీసీ, వనపర్తి)**

---------------------------------

**ఖమ్మం- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**

దేశంలో యువ సంపద ఎక్కువగా ఉందని, అందుకనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాయని ఖమ్మం రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. మాజీ ఉప ప్రధాన మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను

పురస్కరించుకొని, ఈరోజు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యువభారత్ ఆధ్వర్యంలో చేపట్టిన 'యూనిటీ మార్చ్'కార్యక్రమాన్ని ఎంపీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పటేల్ స్ఫూర్తి వల్లే మన దేశం ఐక్యంగా నిలిచిందన్నారు

**(సౌండ్ బైట్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర)**

**పీటీసీ – భద్రాద్రి కొత్తగూడెం**

---------------------------

కరీంనగర్ -ఐక్యత పాదయాత్ర

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన యూనిటీ మార్చ్- ఐక్యతా పాదయాత్ర నేటితో ఘనంగా ముగిసింది.కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేరా యువ భారత్ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి హుజురాబాద్ ఏసీపీ మాధవి ముఖ్య అతిథిగా హాజరై వివేకానంద,సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**పీటీసీ - కరీంనగర్**

--------------------------

**జీహెచ్ఎంసీ**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జీహెచ్ఎంసీ కౌన్సిల్ చివరి సమావేశం సభ్యుల నిరసనల మధ్య ఈ రోజు ప్రారంభమైంది. మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు పలు అంశాలపై నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించగా, బీజేపీ కార్పొరేటర్లు కూడా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, తన పదవీకాలంలో నగర అభివృద్ధికి కృషి చేశామని, ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ, ఫ్లై ఓవర్లు, పచ్చదనానికి ప్రాధాన్యత ఇచ్చామని పేర్కొన్నారు.

**పీటీసీ – హైదరాబాద్**

----------------------

**కొత్తగూడెం- కలెక్టర్**

కార్మికుల బీమా పెంపు గోడపత్రికను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కార్మికుల బీమా మొత్తం పెంపు ఒక చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు.

**(PTC-B. KGM)**

----------------------

**సిరిసిల్ల జిల్లా-ఈ శ్రమ్**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని భవన నిర్మాణ, ఇతర రం గాల్లోని కార్మికులు 'ఈ-శ్రమ్' పోర్టల్లో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ సూచించారు. కార్మిక శాఖ రూపొందించిన పోస్టర్లను జిల్లా కలెక్టరేట్ లో ఆవిష్కరించారు.

**(పీటీసీ, సిరిసిల్ల)**

--------------------------

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా-జల్ సంచయ్–జన్ భాగీదారీ**

జల్ సంచయ్–జన్ భాగీదారీ మూడో కేటగిరీలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. నీటి సంరక్షణలో విశేష కృషి చేసి జాతీయస్థాయిలో జిల్లాకు గుర్తింపు తీసుకువచ్చిన అధికారులకు కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేసి సత్కరించారు.

**(PTC-B. KGM)**

--------------------------------